# మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట




## పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ఆపేది లేదు

◆ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే19, ప్రభాతవార్త:** పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపే ప్రసక్తి లేదని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. రాష్ట్రభారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సచివాలయంలోని వారి కార్యాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యే లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పాలమూరు ,రంగారెడ్డి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని వారు మంత్రిని కోరారు. ప్రాజెక్టు చరిత్రాత్మక ప్రాధాన్యతను వివరించి, దీని ద్వారా జిల్లాలో నీటి సమస్యలు పూర్తిగా పరిష్కారమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడంతో పాటు మిగిలిన నిధులను కూడా విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.అలాగే ప్రాజెక్టు పూర్తి కావడానికి అవసరమైన భూసే కరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.భూసేకరణలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుపై ఎప్పటికప్పుడు సమగ్ర సమీక్ష నిర్వహించి, పనుల పురోగతిని పర్యవేక్షిస్తామని తెలిపారు. పాలమూరు ప్రాంత అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకమని, రైతులకు సాగునీటి సౌకర్యంకల్పించడంప్రభుత్వ లక్ష్యమని మంత్రి వివరించారు. పదిహేను రోజుల్లోగా ఉమ్మడి జిల్లాకు వస్తానని మంత్రి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు జి.మధుసూదన్ రెడ్డి, రాజేష్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, డా. వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

◆ గన్ని బ్యాగుల కొరత రానీయొద్దు ◆ ధాన్యాన్ని వెంటనే అన్లోడ్ చేయాలి
◆ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ◆ నాగారం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన



కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**దేవరకద్ర, మే 19 ప్రభాతవార్త:** అకాల వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున జిల్లాలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోళ్ళను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. మంగళవారం దేవరకద్ర మండలం నాగారం గ్రామం వద్ద ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలలో నీటి వసతి నీడ వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో గన్ని బస్తాలకొరత లేకుండా తగినన్ని బస్తాలను అందు బాటులో ఉంచుకోవాలని, అధిక సంఖ్యలో హమాలీలను నియమించుకొని, తగినన్ని రవాణా వాహనాలను ఏర్పాటు చేసుకుని నింపి ఉన్న ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం మహబూబ్ నగర్ రూరల్ మండలంలోని కోడూర్ జననీ ఆగ్రోటెక్ బాయిల్డ్ రైస్ మిల్లును సందర్శించి తనిఖీ చేశారు. రైస్ మిల్లులో అధిక సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసుకొని లారీలను వెంటనే అన్ లోడింగ్ చేయాలని అన్నారు. ధాన్యం రవాణాకు తగినన్ని వాహనాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. తరుగు కటింగ్ చేయకుండా రైతులకు వెంటనే చెల్లింపులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి హరిప్రియ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి గంప శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇంటాక్ మహబూబ్‌నగర్ చాప్టర్‌కు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం



ఇంటాక్ మహబూబ్‌నగర్ చాప్టర్ సభ్యులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే19, ప్రభాతవార్త:** సంస్కృతి, వారసత్వ పరిరక్షణతో పాటు గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవకాశాలు కల్పించడంలో ఇంటాక్ మహబూబ్‌నగర్ చాప్టర్ చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. ఇంటాక్ మహబూబ్‌నగర్ చాప్టర్ సభ్యులు మంగళవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను కలెక్టర్ కార్యాలయంలో కలుసుకుని చాప్టర్ కార్యకలాపాల వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటాక్ చాప్టర్ ప్రధాన పరిరక్షకురాలిగా ఉండటం ఆనందంగా ఉందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ పరిరక్షణలో పంచాయతీల పాత్రపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సినఅవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. చాప్టర్ నిర్వహించే కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఇంటాక్ మహబూబ్‌నగర్ చాప్టర్ కన్వీనర్ డా.టి. నాగేందర్ స్వామి సంస్థ లక్ష్యాలు, కార్యక్రమాలు, వారసత్వ పరిరక్షణకు సంబంధించిన చర్యలను కలెక్టర్‌కు వివరించారు. కో కన్వీనర్ చంద్రకుమార్, అదనపు కో కన్వీనర్ వివిఎస్‌ఆర్‌కె ప్రసాద్ చాప్టర్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న వివిధ పోటీలు, విద్యార్థుల ప్రతిభాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా నూతనంగా సభ్యత్వం పొందిన సభ్యులతో జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ఇంటాక్ ఢిల్లీ నిర్వహించిన సెలబ్రేటింగ్ ఇండియా" జాతీయ పోస్టర్ పోటీలలో ప్రాంతీయ, చాప్టర్ స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## ధాన్యంలో తరుగు తీయడానికి వీల్లేదు

వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



రైస్ మిల్లుల వద్ద తూకాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, మే 19, ప్రభాతవార్త:** సన్న రకం వరి ధాన్యంతో పాటు దొడ్డు రకం వరి ధాన్యాన్ని కూడా రైస్ మిల్లర్లు తప్పనిసరిగా అన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కొత్తకోట మండలంలోని రాయినిపేట గ్రామంలో ఉన్న సాయినందన ఇండస్ట్రీస్, అమడబాకుల గ్రామంలోని సాయి శ్రీనివాస రైస్ మిల్లులను సందర్శించి వరి అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం రాయినిపేట గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మిల్లర్లకు పలు కీలక సూచనలు చేశారు. సన్న రకం వరి ధాన్యంతో పాటు దొడ్డు రకం వరి ధాన్యాన్ని కూడా రైస్ మిల్లర్లు పాటు తప్పనిసరిగా అన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశించారు. రైతులు ధాన్యం యొక్క తేమ శాతం నిర్దేశించిన దానికన్నా తక్కువే ఇస్తున్నారన్నారు. వరి ధాన్యంలో రైస్ మిల్లర్లు ఎలాంటి కోతలు విధించవద్దని స్పష్టం చేశారు. అన్ లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, మిల్లులు, గోదాముల వద్ద వేచి ఉన్న లారీలను వీలైనంత త్వరగా ఖాళీ చేయాలని సూచించారు. వాహనాలను ఎక్కువసేపు నిరీక్షింప చేయవద్దని తెలిపారు. అలాగే ట్రక్ షీట్లను వెంటనే వాట్సాప్ ద్వారా పీపీసీ ఇంచార్జీలకు పంపించాలని మిల్లర్లను ఆదేశించారు. దీంతో ట్యాబ్ ఎంట్రీలు త్వరగా పూర్తై రైతుల ఖాతాల్లో డబ్బులు త్వరగా జమ అవుతాయని తెలిపారు. వరి కొనుగోలు కేంద్రాల ఇంచార్జ్‌లకు కూడా కలెక్టర్ సూచనలు చేస్తూ, రైతులు వరిని శుభ్రపరిచి తీసుకురావాలని అవగాహన కల్పించాలని తెలిపారు. దీంతో మిల్లర్లు కోతలు విధించే ఆస్కారం ఉండదని పేర్కొన్నారు. అదనంగా లారీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని వరి ధాన్యం తరలింపు విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కాశీ విశ్వనాథ్, రెవెన్యూ అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## పెద్దపులి దాడిలో ఆవు మృతి

భయాందోళనలో రైతులు



పెద్దపులి దాడిలో మృతి చెందిన ఆవు

**అచ్చంపేట, మే 19 ప్రభాతవార్త:** పెద్దపులి దాడిలో ఆవు మృతి చెందిన ఘటన అచ్చంపేట మండలంలోని శివారు తండా గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం శివారు తండా గ్రామానికి చెందిన పద్మావత్ మొత్యా నాయక్ రోజు మాదిరిగానే తన వ్యవసాయ పొలంలో ఆవులను కట్టేసి ఉదయం పొలం దగ్గరికి వెళ్లి చూడగా ఆవు మృతి చెందిన విషయాన్ని గ్రామస్థుల ద్వారా ఫారెస్ట్ అధికారులకు తెలుపగా వారు ట్రాక్ కెమెరా ఏర్పాటు చేయడంతో మరుసటి రోజు మరోసారి పెద్దపులి ఆవు దగ్గరికి రావడాన్ని గుర్తించారు.ఈ విషయంపై గ్రామస్తులు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడ పెద్దపులి ఉందో తెలియక వ్యవసాయ పొలంలో పనులు చేయాలంటేభయంతో వణికిపోతున్నారు. ఫారెస్ట్ అధికారులు స్పందించి వెంటనే పెద్దపులిని బంధించాలని కోరుతున్నారు.రైతు మూత్య నాయక్‌కు దాదాపు రూ.80 వేల నష్టం వాటిల్లినట్టు తెలిపారు.

## కోయిల కొండ బైపాస్‌లో రోడ్డు ప్రమాదం : వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదానికి గురైన నర్సింలు

**మహబూబ్‌నగర్, మే 19 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం శివారులోని కోయిలకొండ చౌరస్తాలో ఆదివారం ఎన్మగండ్ల నుంచి తన అత్తగారి గ్రామమైన రుద్రారంకు బయలుదేరిన నర్సింలు అనే వ్యక్తి కోయిలకొండ చౌరస్తాలో ప్రమాదానికి గురయ్యాడు. అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. మంగళవారం చికిత్స పొందుతూ నర్సింహులు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రెండు రోజుల పాటు కోమాలో ఉన్న నర్సింహులు మృత్యువుతో పోరాడి చివరకు తుది శ్వాస విడిచాడు. నవాబుపేట మండలం,ఎన్మన్‌గండ్ల నివాసి అయిన కనేమోని నరసింహులు ఆదివారం తన పని పూర్తి చేసుకుని.. అత్తగారిల్లు అయిన బుద్దారం గ్రామంలో బొడ్రాయి పండుగకు వెళ్తుండగా కోయిలకొండ చౌరస్తా వద్ద బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. రోడ్డుపై మట్టి దిమ్మెలు అడ్డంగా వేసి ఉండటంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. కొత్తగా నిర్మించిన బైపాస్ చౌరస్తాలో ఎటువంటి ప్రమాద హెచ్చరికలు లేకపోవడం, రోడ్డుపై పెద్ద ఎత్తున మట్టి పోసి ఉండటంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి ప్రమాద హెచ్చరికలు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరుతున్నారు.

## బ్యాంకుల వద్ద భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలి



బ్యాంకు వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

**నారాయణపేట, మే 19 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా డా.వినీత్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని వివిధ బ్యాంకుల వద్ద టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నారాయణపేట పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా బ్యాంకు అధికారులకు, ఖాతాదారులకు భద్రతాపరమైన సూచనలు అందించారు.బ్యాంకులకు వచ్చే ప్రజలు తమ నగదు,ఆభరణాలు,వ్యక్తిగత సమాచారాన్ని సురక్షితంగా కాపాడుకోవాలనిసూచించారు.ఇటీవల బ్యాంకుల వద్ద మోసాలు,చోరీలు, సైబర్ నేరాలుపెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. –మిగతా4లో..

# జిల్లాలో నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

◆ ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే లక్ష్యం
◆ తాగునీటి సమస్యల పరిష్కారానికి శాఖల సమన్వయం అవసరం
◆ నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే19 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రతి గ్రామానికి, పట్టణాల్లోని ప్రతి వార్డుకు నిరంతరాయంగా సురక్షితమైన తాగునీరు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో మిషన్ భగీరథ మరియు ఆర్డబ్ల్యూఎస్ శాఖల అధికారులతో జిల్లాలో త్రాగునీటి పంపిణీ సమస్యలపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో ఎక్కడ తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో రోజువారీ నీటి సరఫరా పరిస్థితిని సమీక్షి ంచిన కలెక్టర్, పైప్‌లైన్ లీకేజీలు, మోటార్ల పనితీరు, నిల్వ ట్యాంకుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో వెంటనే మరమ్మతు పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని 460 గ్రామాలకు ప్రతిరోజూ 160 ఎంఎల్‌డీ తాగునీటి సరఫరా జరుగుతోందని పేర్కొంటూ, బిజినపల్లి, కోడేరు, వెల్దండ, కొల్లాపూర్ మండలాల్లో నీటి కొరతను అధిగమించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా డిండి రిజర్వాయర్ నుంచి అచ్చంపేట, సర్వాయిపల్లి, కొల్లాపూర్, ఎల్లూరు గ్రామాలకు తాగునీటి సరఫరా కోసం అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి సురక్షి త తాగునీరు అందించే లక్ష్యాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని, ఫీల్డ్ స్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా కూడా తాగునీరు సరఫరా చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ అధికారులు జిల్లాలోని వివిధ మండలాల్లో నీటి సరఫరా పరిస్థితి, చేపడుతున్న మరమ్మతు పనులు, అందుబాటులో ఉన్న నీటి వనరుల వివరాలను కలెక్టర్‌కు తెలియజేశారు. గ్రామాల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు చేపడుతున్న చర్యలను కూడా వివరించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఇంజినీర్లు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో తాగునీటి సమస్యల పరిష్కారానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్సీ ఆర్డబ్ల్యూఎస్ జగన్మోహన్ రావు, మిషన్ భగీరథ ఈఈ సుధాకర్ సింగ్, మిషన్ భగీరథ ఈఈ ఇట్రా విజయ్ శ్రీ, ఆర్డబ్ల్యూఎస్ మిషన్ భగీరథ డీఈలు, ఎఈలు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత ఉండాలి

- రైతులకు సకాలంలో చెల్లింపులు జరగాలి
- రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 19 ప్రభాతవార్త:** రైతులు పండించిన పంటకు న్యాయమైన ధరతో పాటు సకాలంలో చెల్లింపులు అందేలా కొనుగోలు కేంద్రాలు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులకు సూచించారు. ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉంటే కొనుగోలు ఆలస్యమవుతుందనే విషయాన్ని రైతులకు స్పష్టంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. కోడేరు మండల పరిధిలోని పసుపుల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సందర్శించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు ప్రక్రియను సమగ్రంగా పరిశీలించారు. రైతులు తీసుకొచ్చిన వరి ధాన్యాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన,ధాన్యంలో ఉన్న తేమశాతాన్ని ప్రత్యేకంగా తనిఖీ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ధాన్యం కొనుగోలు జరుగుతున్నదా లేదా అనే అంశంపై అధికారులు,సిబ్బందిని అడిగి జిల్లాకలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ధాన్యాన్ని విక్రయించగలిగేలా కొనుగోలు కేంద్రాల్లో తగిన సదుపాయాలు కల్పించాలని సూచించారు.ఈ సందర్భంగా ధాన్యం నిల్వ, తూకం విధానం, రికార్డు నిర్వహణ,టోకెన్ విధానం వంటి అంశాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రైతులతో నేరుగా మాట్లాడి కొనుగోలు ప్రక్రియపై వారి అభిప్రాయాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కొనుగోలు కేంద్రాల వద్ద ఎదురవుతున్న చిన్నపాటి సమస్యలను కూడా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బంది, అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి

● నారాయణపేట జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక




అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక

**నారాయణపేట, మే 19 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 22న నిర్వహించనున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ జిల్లా స్థాయి కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీసీ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు గ్రామ,మండల, నియోజకవర్గ స్థాయిల్లో పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాల ఫొటోలు, లబ్ధిదారుల వివరాలు, నిధుల సమాచారాన్ని సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై శాఖల వారీగా స్టాళ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులను కార్యక్రమానికి ఆహ్వానించాలని సూచించారు. స్క్రీన్, సౌండ్ సిస్టమ్ ఏర్పాట్లపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు స్నాక్స్, భోజన ఏర్పాట్లను కూడా పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా మైసమ్మ బోనాల పండుగ



బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

**మద్దూరు, మే19 ప్రభాతవార్త:** మద్దూరు మున్సిపాలిటీ కేంద్రంలో శ్రీ మైసమ్మ బోనాల పండుగనుభక్తిశ్రద్ధలతో ఘనంగానిర్వహించారు. మహిళలు అలంకరించిన బోనాలతో పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. అనంతరం భక్తులు తమ మొక్కులు తీర్చుకుని కుటుంబ సౌఖ్యం, గ్రామ శాంతి కోసం ప్రార్థనలు చేశారు. ఆలయ పరిసరాలు భక్తజనాలతో కిక్కిరిసిపోయాయి. పండుగ సందర్భంగా మద్దూరు పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. మైసమ్మ తల్లి కృపతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

## ఇండ్ల తొలగింపుపై అధికారులకు యజమానుల మధ్య ఘర్షణ



అధికారులతో వాదనకు దిగిన ఇంటి యజమానులు

**పెబ్బేరు, మే 19 ప్రభాత వార్త:** పెబ్బేరు పురపాలికలో రోడ్డు విస్తరణలో భాగంగా పెబ్బేరు వనపర్తి రోడ్ లోని కొందరు ఇంటి యజమానులు ఇండ్ల తొలగింపులో జాప్యం చేయడంతో మున్సిపాలిటీ అధికారులు జెసిబిల సాయంతో తొలగించే ప్రయత్నం చేశారు.అందుకు యజమానులు గడువు కావాలని కోరడంతో అధికారులుఇప్పటికే చాలా గడివిచ్చామని ఇక తొలగించాల్సిందే అంటూ తెలిపారు. దీంతో ఇంటి యజమానులకు మున్సిపల్ అధికారులకు చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకుంది. మున్సిపల్ అధికారులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు.ఎస్సై అక్కడ చేరుకొని సమస్య ను సద్దుమణిగేలా యజమానితో మాట్లాడి ఒక రోజు గడువు ఇస్తున్నామని తెలిపారు.తర్వాత తొలగించాల్సిందేనంటూ ఎస్ఐ వెంకటేష్ గౌడ్ మున్సిపల్ అధికారులకు తెలిపారు.



భవన నిర్మాణ కార్మికుల గోడపత్రిక విడుదల చేస్తున్న టియుసిఐ జిల్లా కార్యదర్శి

## భవన నిర్మాణ కార్మికులకు 9 వేల పెన్షన్ ఇవ్వాలి

**ఆత్మకూర్ మే 19, ప్రభాతవార్త;** రాష్ట్రవ్యాపితంగా భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం నెలకు 9,000 రూపాయల పెన్షన్ చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సి. రాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆత్మకూరు మండలంలోని మోట్లంపల్లి గ్రామంలో భవన్ నిర్మాణ కార్మికుల సమస్యపై చలో హైదరాబాద్ గోడపత్రికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు తమ సమస్యల కోసం ఈనెల 25న హైదరాబాద్ కేంద్రంలో జరగనున్న ధర్నాకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భవన నిర్మాణ కార్మికుల ఆరోగ్యానికి ఎలాంటి భద్రత లేకుండా పోయిందని ప్రమాద బీమాపథకాన్ని తక్షణమే అమలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం లేబర్ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేయడమే కాకుండా ప్రభుత్వం తరఫున పెన్షన్ అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని లేనిపక్షంలో భవన నిర్మాణ కార్మికులు ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. అందులో భాగంగానే ఈనెల 25న హైదరాబాద్ పట్టణంలో జరగనున్న భవననిర్మాణ కార్మికుల సదస్సుకు రాష్ట్రవ్యాపితంగా భవన నిర్మాణ కార్మికులు వేల సంఖ్యలో తల్లి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు భవన నిర్మాణ కార్మికులు, టియుసిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటిని సరఫరా చేయండి మహాప్రభో..

● ఉప్పునీటిని తాగలేక అవస్థలు పడుతున్న వార్డు ప్రజలు

**చిన్నచింతకుంట, మే 19న ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని 8, 9, 10 ,11 వార్డులలో మంచినీరు రాక ఉప్పునీరు త్రాగలేక కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. ఈ వార్డులకు సమీపంలోని ఊక చెట్టు వాగులోని ఊట బావి నుంచి మంచినీరును గతంలో సరఫరా చేసేవారు. కానీ ఈ మధ్యకాలంలో ఊట బావిలో నీటిమట్టం తగ్గిపోవడంతో ఇదివరకే వేసిన ఉప్పునీటి బోరు ఉంచి నీటి ట్యాంకులో ఉప్పునీటితో నింపి ఈ నాలుగు వార్డులకు సరఫరా చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా ఉప్పునీరు, మిషన్ భగీరథ జమ్ము నీరు తాగలేక కాలనీవాసులు అనారోగ్యాల పాలవుతున్నారు. వాగు మధ్యలో గతంలో బోరు వేశారు దాన్ని కొద్దిగా ఉసుకను తొలగించి పైప్ లైన్ ద్వారా నీటిట్యాంకును నింపి ఈనాలుగు వార్డులకు పంపిణీ చేయాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీది ఉప్పునీటి సమస్యపై ఎన్నిమార్లు గ్రామపంచాయతీ దృష్టికి తీసుకెళ్లిన నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయాకాలనీల ప్రజలు అగ్రహాన్నివ్యక్తం చేస్తున్నారు. గ్రామ సర్పంచ్ ,పంచాయతీ కార్యదర్శి పూర్తిగా నిర్లక్ష్యమే కారణమని వెంటనే నీళ్ల త్రాగడానికి అందించాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా పై స్థాయి అధికారులు స్పందించి ఉప్పు నీరు కాకుండా మంచినీరుసరఫరా చేయాలని లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని కాలనీవాసులు హెచ్చరించారు.

## స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించిన విద్యార్థులకు సన్మానం



ర్యాంకు సాధించిన విద్యార్థినిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

**దామరగిద్ద, మే 19 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం కందెన్‌పల్లి గ్రామానికి చెందిన విద్యార్థి వై. శివ కుమార్ యాదవ్ ఇంటర్ ఫస్టియర్ సీఈసీ విభాగంలో 495/500 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంక్ సాధించడంతో తెలంగాణ తెలుగు దేశం పార్టీ నేతలు ఘనంగా సన్మానించారు. మహబూబ్‌నగర్ టిడిపి పార్లమెంటు నియోజకవర్గ మాజీ ఉపాధ్యక్షుడు రాములు యాదవ్ ఆధ్వర్యంలో శివ కుమార్ యాదవ్‌కు శాలువా కప్పి, అన్నా ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ చిత్రాలతో కూడిన మెమెంటోను అందజేశారు. అదేవిధంగా ఇంటర్ సెకండియర్‌లో జి. మోహన్ యాదవ్ 963/1000 మార్కులు సాధించి జిల్లా ద్వితీయ ర్యాంక్ పొందడంతో ఆయనను కూడా శాలువాతో సత్కరించి మెమొంటో అందజేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా రాములు యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు శివ కుమార్‌యాదవ్, మోహన్ యాదవ్‌లను ఆదర్శంగాతీసుకుని ఉన్నత విద్యను అభ్యసించి గ్రామానికి, జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు ఎన్టీఆర్ ట్రస్టుతరఫున స్కాలర్‌షిప్‌లుఅందజేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించడంలో తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు మొగులప్ప, లింగారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ ఈరన్న గౌడ్, భీమప్ప, అంజి, నరసింహులు, రవి, రఘు, కేశప్ప, అంజమ్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పుచ్చలపల్లి సుందరయ్య వీరోచిత పోరాట యోధుడు


● సిపిఎం మండల కార్యదర్శి వెంకట్రాములు



పుచ్చల్లపల్లి సుందరయ్య వర్ధంతిలో నాయకులు

**మదనాపురం, మే19 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారంలో పుచ్చులపల్లి సుందరయ్య వీరో చిత పోరాటం చేశారని సిపిఎం మండల కార్యదర్శి ఎమ్. వెంకట్రాములు అన్నారు. అజ్జకొల్లు, రామన్ పాడ్ గ్రామంలో మండల కేంద్రంలో మంగళవారం పుచ్చల్ల పల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి భుక్తి పేద ప్రజల విముక్తి కోసం పుచ్చులపల్లి ఆ రోజుల్లో పోరాట త్యాగం చేశారన్నారు. పేద ప్రజల పక్షాన నిలబడి కూలిరేట్లను ప్రభుత్వాల ద్వారా పెంచారన్నారు. దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం అభివృద్ధి కోసం కృషి చేసిన పుచ్చులపల్లి భూస్వామి కుటుంబంలో పుట్టినా కూడా నిరంతరం పేదల కోసం పని చేశారన్నారు. సమస్యల పరిష్కారంలో పోరాట పటిమ ఎనలేనిదని, ఆయన త్యాగాలు ఎప్పటికీ వృధా కావన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కరగట్ల బుచ్చన్న, సిపిఎం నాయకులు వెంకటేష్, సత్యనారాయణ, మొగిలి చంద్రాయుడు, రాజు, కొమ్ములేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రిపోర్టర్ కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**గోపాల్‌పేట్, మే 19 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రానికి చెందిన వి6 వెలుగు రిపోర్టర్ జోగు రాములు (52) గత 3 సంవత్సరాలు నుండి అనారోగ్యంతో బాధపడుతూ తెల్లవారు జామున మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొంకి వెంకటేష్, ఉమ్మడి గోపాల్ పేట మండల మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు మంద సత్యశీలారెడ్డి వనపర్తి శాసనసభ్యులు తుడి మేఘ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే మానవత దృక్పథంతో స్పందించిన ఎమ్మెల్యే వి6 వెలుగు రిపోర్టర్ రాములు కుటుంబానికి పదివేల రూ.10,000/ ఆర్థిక సహాయం ప్రకటించి రిపోర్టర్ కుటుంభానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో లోడే రఘూ, జిల్లా యూత్ కాంగ్రెస్ ఆర్టిఐ చైర్మన్ కొంకి రమేష్, రేవెల్లి వడల పర్వతాలు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## రిపోర్టర్ జోగు రాములకు తోటి పాత్రికేయుల నివాళి



**గోపాల్ పేట్, మే 19 ప్రభాతవార్త:** గోపాలపేట మండల్ లో స్థానికంగా విధులు నిర్వహిస్తున్న వెలుగు రిపోర్టర్ అనారోగ్యం కారణంగా మృతి చెందడం పాత్రికేయ లోకంలో విషాదాన్ని నింపింది. మృతి చెందిన జర్నలిస్టుకు తోటి మిత్రులు, పాత్రికేయులు ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. పాత్రికేయ వృత్తిలో నిబద్ధతతో పనిచేసిన ఆయన ప్రజా సమస్యలపై ఎన్నో కథనాలు వెలుగులోకి తీసుకువచ్చారని సహచరులు గుర్తుచేశారు. మృతి వార్త తెలిసిన వెంటనే వివిధ గోపాలపేట మండల్ చెందిన జర్నలిస్టులు ఆయన నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు మిత్రులు మాట్లాడుతూ ఆయన మరణం మీడియా రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబానికి ధైర్యం చెప్పుతూ అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం రెండు నిమిషాలపాటు మౌనం పాటించి నివాళులు అర్పించారు.

# వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

● ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఈశ్వర్
● నల్లమలలో ఘనంగా సేవ్ ది టైగర్ అవగాహన సదస్సు
● ఆకట్టుకున్న ఫోటో ఎగ్జిబిషన్



మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఈశ్వర్

**లింగాల, మే 19, ప్రభాతవార్త:** అడవులు, వన్యప్రాణుల సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్క పౌరుని కర్తవ్యమని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఈశ్వర్ అన్నారు. మంగళవారం నల్లమల అడవుల రక్షణ, పులుల సంరక్షణే ధ్యేయంగా లింగాల గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో స్కైలార్క్ మెడికల్ ఇండియా, అగన్య ఫౌండేషన్, హర్షిత ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సేవ్ ది టైగర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అటవీ ప్రాంతంలో పులుల రక్షణపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఈ సదస్సును ఏర్పాటు చేశారు. నల్లమల అడవుల అపూర్వ జీవవైవిధ్యాన్ని, వన్యప్రాణుల వైభవాన్ని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోటో ఎగ్జిబిషన్ సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంది. అడవిని, పులులను కాపాడుకుంటామని ఈ సందర్భంగా గ్రామస్థులు ప్రతినబూనారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఈశ్వర్ మాట్లాడుతూ పులుల పరిరక్షణ ద్వారానే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని, ఈ యజ్ఞంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అడవుల పరిరక్షణ వన్యప్రాణుల సంరక్షణ కోసం చట్టాలు కఠినంగా ఉన్నాయని వాటిపై అవగాహన పెంచడానికి అటవీ శాఖ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అడవి రక్షణ మన బాధ్యత అని ఎవరూ అనధికారికంగా అడవిలోకి వెళ్ల కూడదని పేర్కొన్నారు. చెట్లనునరకకూడదని స్పష్టం చేశారు. అడవికి గానీ, వన్యప్రాణులకు గానీ ఎలాంటి నష్టం కలిగించినా ప్రభుత్వ చట్టాల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తూ పలు సూచనలు చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కోర్టు కేసులను ఎదుర్కోవాల్సి వస్తుందని, కాబట్టి గ్రామ ప్రజలంతా అటవీ శాఖకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. ఈ అవగాహన సదస్సులో భాగంగా అడవుల ప్రాముఖ్యతపై వక్తల ప్రసంగించారు. ప్రజల్లో అటవీ సంరక్షణ, వన్యప్రాణుల రక్షణపై పూర్తిస్థాయి చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని ప్రోగ్రామ్ డైరెక్టర్ వీరకుమార్ మోతా తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ వెంకటయ్య, డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్ జగదేవ్, లింగాల ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎండి. ఖాదర్ బాషా, ఇతర అటవీ శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు లింగాల గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

*టూరిజం వారోత్సవాలలో భాగంగా కృష్ణానది తీరంలో*

# ప్రకృతి అందాలు ఆధ్యాత్మిక క్షేత్రాలు సోమశిల టూరిజం

● జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ
● రత్నగిరి ఫౌండేషన్ విద్యార్థినులకు టూరిజం పై అవగాహన



రత్నగిరి ఫౌండేషన్ విద్యార్థినులకు టూరిజం పై అవగాహన కల్పిస్తున్న పర్యాటక శాఖ అధికారి



**కొల్లాపూర్, మే19, ప్రభాతవార్త:** 99 రోజుల ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు కొల్లాపూర్ మండల పరిధిలో సోమశిల క్షేత్రంలోని కృష్ణానదీతీరంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ ఆధ్వర్యంలో రత్నగిరి ఫౌండేషన్ విద్యార్థినులకు, పర్యాటకులకు టూరిజం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ మాట్లాడుతూ సోమశిల పరిసరాల్లో టూరిజం పరంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని సోమశిల సిద్దేశ్వరం కేబుల్ వంతెన నిర్మాణంతో రెండు తెలుగు రాష్ట్రాలకు రాకపోకలు సులభతరం అవుతాయని, మల్లేశ్వరం ఐల్యాండ్ లో కాటేజ్ ల నిర్మాణంతో రాబోయే కాలంలో టూరిస్ట్‌ల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, అదే విధంగా సోమశిల, సంగమేశ్వరంలాంటి ఆధ్యాత్మిక ప్రదేశాలతో టూరిజం పరంగా జరిగిన అభివృద్ధిని కృష్ణ నది ఒడ్డున ఉన్న సుందరమైన బ్యాక్ వాటర్, ఆహ్లాదకరమైన వాతావరణ అందాలు నల్లమల కొండల నడుమ ఈ ప్రాంతం పచ్చదనంతో సుందరంగా ఉంటుందని నదీతీరంలోలాంచీ ప్రయాణం ఇలాంటి ఎన్ని అద్భు తాలను సోమశిల టూరిజం ప్రాంతం అందాలను రత్నగిరి ఫౌండేషన్ విద్యార్థినిలకు, పర్యాట కులకు తెలియజే స్తూ టూరిజం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడంజరిగింది. ఈ కార్యక్రమంలో సోమశిల గ్రామ సర్పంచ్ కాటం వెంకటలక్ష్మి వెంకటస్వామి, ఉప సర్పంచ్ ఖాదర్ పాషా, మాజీ సర్పంచ్ బింగిమద్దిలేటి, టూరిస్ట్ పోలీస్‌లు ఎం. శివ శంకర్, ఎస్ శివశంకర్, టూరిజం సిబ్బంద్ది చిన్న, శివ, వినోద్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మిక సమస్యలపై పోరాడుదాం

నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివుడు



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘ నేతలు

**చిన్న చింతకుంట, మే 19 ప్రభాతవార్త :** భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ ప్రగతిశీల భవన, నిర్మాణ కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివుడు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో టి యు సి ఐ అనుబంధ సంఘమైన భవన, నిర్మాణ కార్మిక సంఘం హెచ్ 74 రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 25న చలో హైదరాబాద్ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996లో సంక్షేమ చట్టం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం 2008 లో అమలులోకి తీసుకొచ్చిందన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు కార్మికులకు రావాల్సిన సంక్షేమ పథకాలు సక్రమంగా అందడం లేదన్నారు. రాష్ట్రంలో 25 లక్షల లేబర్ కార్డులు తీసుకోవడం జరిగిందని, ఈ యొక్క లేబర్ కార్డు 60 ఏళ్ళు దాటితే ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. కార్మికుడు వృద్ధాప్యంలో కనీస పెన్షన్ సౌకర్యం కల్పిస్తూ 9000 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వివాహ, డెలివరీ క్లైమ్ లు ఇప్పటివరకు పరిష్కారం కాలేదని ఆయన విమర్శించారు. లేబర్ ఇన్సూరెన్స్ ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేట్ సంస్థలకు అప్పగించడంతో అవినీతిమయమైపోయిందన్నారు. భవన మరియు నిర్మాణ కార్మికుల సమస్యలపై 25న హైదరాబాదులో చేపట్టే ధర్నాకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి భవన మరియు నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో టియుసిఐజిల్లా అధ్యక్షులు దేవదానం, నాయకులు అడివన్న, నరసింహులు, రాజు, కోళ్ల అంజనేయులు, ప్రవీణ్ ఉన్నారు.

# పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే మంజూరు చేయండి



గ్రామ పంచాయతీ సిబ్బందికి జీతాలు అందజేయాలని సర్పంచుకు వినతి

**ఉప్పునుంతల, మే 19 ప్రభాతవార్త:** మండలంలోని వెల్టూర్ గ్రామ పంచాయతీ కార్మికులకు గత 7 నెలల నుంచి వేతనాలు లేవని సత్వరమే వేతనాలు మంజూరు చేయాలని మంగళవారం గ్రామ పంచాయతీ సిబ్బంది సర్పంచు చింతోజు వెంకటేష్ కు వినతి పత్రం అందజేశారు. తాము నిరుపేద కుటుంబాలకు చెందిన వారమని గత 7 నెలలుగా జీతాలు లేకుండా పనిచేయడం కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉందని పలు దఫాలుగా సంబంధిత అధికారులకు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయిందని వారు వాపోయారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు నిర్వహించడం కష్టంగా మారిందని వారు విన్నవించుకున్నారు. గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ తమకు జీతాలు లేకుండా పనిచేయాలంటే ఎలా అని, నేటి నుంచి విధులకు రావడం లేదని వారు ప్రకటించారు. అనంతరం గ్రామ సర్పంచ్‌కు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేసి తమకు న్యాయం చేయాలని వారు వినతి పత్రం ద్వారా కోరారు. తమ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు సర్పంచ్ ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికితీసుకెళ్లి సత్వరమే పరిష్కరించాలని వారు కోరారు. గ్రామ సర్పంచు చింతోజు వెంకటేష్ కు వినతి పత్రం అందజేసిన వారిలో గ్రామపంచాయతీ సిబ్బంది సైదులు, లాలు, నిరంజన్ లక్ష్మమ్మలు ఉన్నారు.

# పెద్దమందడి, ఖిల్లా గణపురం మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు సన్మానం



చైర్మన్, వైస్ చైర్మన్‌లను సన్మానించిన సాయి చరణ్ రెడ్డి

**పెద్దమందడి, మే19 ప్రభాతవార్త:** పెద్దమందడి, ఖిల్లా గణపురం మండలాల ఉమ్మడి మార్కెట్ యార్డ్ నూతన చైర్మన్ నవనీత, వైస్ చైర్మన్ కొత్త కాపు వెంకటేశ్వర్ రెడ్డి డైరెక్టర్లకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సాయి చరణ్‌రెడ్డి, ఖిల్లాఘనపూర్ మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల నూతనంగా నియమితులైన చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సాయి చరణ్ రెడ్డి మాట్లాడుతూ రైతులఅభ్యున్నతికి మార్కెట్ యార్డ్ కమిటీ సమిష్టిగా పనిచేసే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ రామనవనిత, వైస్ చైర్మన్ కొత్త కాపు వెంకటేశ్వర్ రెడ్డి డైరెక్టర్లు వర్షం వ్యక్తం చేస్తూ తమపై నమ్మకం ఉంచి అవకాశం కల్పిస్తున్న ఎమ్మెల్యే మెగా రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరం

● కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

**వెల్దండ, మే 19 ప్రభాతవార్త:** అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. వెల్దండ మండలంలోని హైదరాబాదులో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో మంగళవారం పెద్దాపూర్ గ్రామానికి చెందిన గంగాపురం చిన్నయ్య 60 వేలు, కాటిక శ్రీశైలం 39 వేలు, కోమ్మగోని జ్యోతి 11వేలను మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి అన్ని విధాల కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

### పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన
## దివ్యాంగ విద్యార్థులకు ఘన సన్మానం



**దామరగిద్ద, మే 19 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఎన్‌ఎచ్‌సి (నైబర్ హుడ్ సెంటర్) సహకారంతో పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన దివ్యాంగ విద్యార్థులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దామరగిద్ద సర్పంచ్ అద్దన్ కనికి రెడ్డి, దివ్యాంగుల మండల అధ్యక్షుడు గజలప్ప, ప్రొఫెషనల్ కిరణ్ కుమార్ పాల్గొని విద్యార్థులను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన దివ్యాంగుల తల్లిదండ్రుల సమావేశంలో కిరణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించాలని సూచించారు. సదరం క్యాంపు తేదీలు వచ్చినప్పుడు గ్రామాల్లోని దివ్యాంగులకు సమాచారం అందించి, వారిని క్యాంపులకు తీసుకెళ్లేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే హాస్పిటల్ ఫాలోఅప్, రోజువారీ కార్యక్రమాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌సి సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## బాలానగర్‌లో..
## రేపు మెడికల్ షాపులు బంద్

**బాలానగర్, మే 19 ప్రభాతవార్త:** ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్‌డ్రగ్గిస్ట్ పిలుపు మేరకు, ఆన్లైన్‌లో ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల డెలివరీ ఇవ్వడాన్ని నిరసిస్తూ భారతదేశం అంతటాఒక రోజు మెడికల్‌షాపులు బంద్ నిర్వహించనున్నారు. బాలానగర్ మండలంలోని అన్ని మెడికల్ షాపులు బంద్ చేయనున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా కెమిస్ట్ ,డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఈ. శంకర్, మండల అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

## పుచ్చలపల్లి ఆశయాలను కొనసాగిస్తాం

**బిజినేపల్లి, మే 19 ప్రభాతవార్త :** దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత సిపిఎం పార్టీ మొదటి కార్యదర్శి పుచ్చులపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిస్తామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుంపల్లిఅశోక్ అన్నారు. పుచ్చులపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. భూమికోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం జరిగిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కీలకపాత్ర పోషించాడని తన సొంత ఇంట్లో కూడా కులాన్ని అంటరానితనాన్ని వ్యతిరేకించిన మహోన్నత నాయకుడని అన్నారు. కమ్యూనిస్టు విలువలకు ఒక నిలువుటద్దంలాంటివాడని అన్నారు. దేశంలో కులం మతం ప్రాంతీయ తత్వం పెట్రేగిపోతున్న ఈ క్రమంలో సుందరయ్య నాటి కాలంలో వీటికి వ్యతిరేకంగా చేసిన కృషి నేటి కమ్యూనిస్టులు మళ్లీ అమలు చేయాలని అన్నారు. భూమి పోరాటాలు నిర్మిస్తూ ప్రజలందరికీ సమాన హక్కుల కోసం పోరాడడమే సుందరయ్యకు ఇచ్చే ఘనమైన నివాళులు అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శుభాకర్, శ్రీశైలం, హనుమంతు, నారాయణ, లక్ష్మమ్మ, మల్లేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో
## మందుల దుకాణాలు

**వనపర్తి, మే19, ప్రభాతవార్త:** నేడు జరగనున్న దేశవ్యాప్త బంద్ సందర్భంగా జిల్లాలో ప్రజలకు మందుల లభ్యతలో ఎటువంటి అంతరాయం కలగకుండా జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కెమిస్ట్, డ్రగ్గిస్ట్ ప్రతినిధులతో సంప్రదించినట్లు ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రజలకు అత్యవసర వైద్య అవసరాలు, ప్రజారోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని వనపర్తి , పెబ్బేర్ , ఆత్మకూరు, కొత్తకోట, పట్టణాల్లో కనీసం మూడు మెడికల్ షాపులు చొప్పున బంద్ రోజున కూడా అందుబాటులో ఉండనున్నట్లు తెలియజేశారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న జీవన్ ధారా జనరిక్ మెడికల్ షాపులు, రెడ్ క్రాస్ జనరిక్ మెడికల్ షాప్స్ కూడా బంద్ రోజున ప్రజలకు అందుబాటులో ఉండనున్నట్లు తెలిపారు. అలాగే జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మెడిప్లస్, అపోలో వంటి రిటైల్ ఫార్మసీ చైన్ ప్రతినిధులతో సంప్రదించగా, వారు కూడా బంద్ రోజున తమ సేవలను కొనసాగిస్తారని, ప్రజలకు మందుల లభ్యతలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి ప్రాంతం, పట్టణంలో కనీసం ఒక మెడికల్ షాప్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అత్యవసర వైద్య అవసరాల కోసం మెడికల్ సేవలు అందుబాటులో ఉంటాయని జిల్లా డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ తెలియజేసింది. మందుల లభ్యతకు సంబంధించిన సమాచారం కొరకు లేదా అత్యవసర వైద్య అవసరాల సందర్భంలో బంద్ రోజున ప్రజల జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్‌ను సంప్రదించవచ్చని తెలియజేశారు.


## బీటి రోడ్ల మంజూరు కోసం
## సీపీఎం బైక్ యాత్రకు పిలుపు

**దామరగిద్ద, మే 19 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలంలోని పిడెంపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాలతో పాటు వివిధ గ్రామాల్లో ఉన్న మట్టిరోడ్లను బీటి రోడ్లుగా మార్చాలని, పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. అలాగే ఉల్లిగుండం-అన్నాసాగర్- నర్సాపూం-లోకుర్తి వరకు పాడైన బీటి రోడ్డును మరమ్మతులు చేయాలని, మద్దూరు నుంచి ఆశన్‌పల్లి-మాల్‌రెడ్డిపల్లి రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరించాలని కోరుతూ ఈ నెల 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకునిర్వహించే బైక్‌యాత్రలో పార్టీలకు అతీతంగా ప్రజలు పాల్గొనాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75సంవత్సరాలు గడిచినా మండలంలోని అనేక గ్రామాలకు ఇప్పటికీ బీటిరోడ్లు లేక పోవడం బాధాకరమన్నారు. రోడ్ల సౌకర్యం లేక గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయని తెలిపారు. అంబులెన్స్ కూడా గ్రామాల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొన్నదని, పిడెంపల్లి-లింగారెడ్డిపల్లి స్టేజ్‌దగ్గరే ఆగిపోతున్నాయని పేర్కొన్నారు. గర్భిణీ స్త్రీలు ఆటోలలో ప్రయాణిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఎంమండల కార్యదర్శి అంజిలయ్యగౌడ్, జోషి, శివకుమార్, బాల్‌రాజ్, సర్పంచ్ రాములు, ఉప సర్పంచ్ రఘు, మాజీ సర్పంచులు వీరప్ప, కథలప్ప, మహేష్ మహిపాల్, మాధవరెడ్డి, ఆటోయూనియన్ నాయకులు పాల్గొన్నారు.



బైక్‌యాత్రకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

# ఐటీఐ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 యూత్ అండ్ స్పోర్ట్స్ థీమ్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి రాఘవేంద్ర సింగ్

**కల్వకుర్తి, మే 19 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో మంగళవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99లో భాగంగా యూత్ అండ్ స్పోర్ట్స్ థీమ్ కార్యక్రమం ఐటిఐ/ఎటిసి కళాశాల ప్రిన్సిపాల్ జయమ్మ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ ప్రోగ్రామ్‌కు ముఖ్య అతిథిలుగా జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి రాఘవేంద్ర సింగ్, ఎస్బీ. లక్ష్మణ్‌స్వామి, ప్రభుత్వ ఆర్ ఐటిఐ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99లో భాగంగా కార్యక్రమం ఆశక్తి, నాయకత్వ లక్షణాల పెంపు, సామాజిక బాధ్యత, ఉద్యోగ కల్పన కోసం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 లో భాగంగా మంగళవారం ప్రభుత్వ ఐటిఐలో నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ జయమ్మ తెలిపారు. వృత్తి నైపుణ్యత అభివృద్ధి దినోత్సవం నైపుణ్యాలకు సాధికారత, భవిష్యత్తులకు సాధికారత కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. దృశ్య, శ్రావణ మాధ్యమాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదే విధంగా వివిధ రకాల నైపుణ్యాలపై, అభివృద్ధి చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో తమ లక్ష్యాన్ని ఏ విధంగా ఉన్నతంగా మలుచుకోవాలనే అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ మున్సనర్, చెన్న బసవయ్య, ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ హైదరాబాద్, జిల్లా యువజన, క్రీడల అధికారి సీతారాం, స్థానిక ఐటిఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి



రైతులతో కలిసి ధర్నాలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు

**వనపర్తి రూరల్, మే 19, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో ఎక్కడ చూసినా వరి ధాన్యం కుప్పలుగా కనిపిస్తున్నాయని, రైతుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి విడనాలని బిఆర్ఎస్ నాయకులు తెలిపారు. మంగళవారం వనపర్తి మండలం రాజపేట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు చేయడం లేదని రోడ్డుపై వరి ధాన్యం పోసి ధాన్యానికి నిప్పు పెట్టి రైతులు ధర్నా నిర్వహించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 45 రోజులు అవుతున్నా ఒక్క బస్తా తూకం కూడా చేయడం లేదని బిఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రైతులు రాజపేట రోడ్డుపై భైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ రాస్తారోకోలో సింగిల్ విండో అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఎల్లయ్య, ఉపసర్పంచ్ చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్ జయరాములు, నాయకులు సుదర్శన్ రెడ్డి, మాధవ రెడ్డి, రైతులు తిరుపతయ్య, తెలుగు నారాయణ, మోహన్ రెడ్డి, సత్యా రెడ్డి, శంకర్ రెడ్డి, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి మెడికల్ షాపుల బంద్‌కు సహకరించండి



**బిజినేపల్లి, మే19 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా మెడికల్ షాపులు బందును విజయవంతం చేయడానికి ప్రజలు సహకరించాలని మెడికల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు రవీందర్ శెట్టి కోరారు. దేశవ్యాప్తంగా ఆన్లైన్ మందులు అమ్మకాలను వ్యతిరేకిస్తూ దేశంలోని మెడికల్ షాప్ ల యజమానులు సంచలన నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. బుధవారం ఆల్ ఇండియన్ ఆర్గనైజేషన్ కెమిస్ట్ అండ్ మెడికల్ షాప్ బంద్ కు పిలుపునిచ్చిన సమయంలో కేంద్రం ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని తమ ఆర్గనైజేషన్ డిమాండ్ చేస్తుందన్నారు. ఆన్లైన్లో ప్రమాదకర నకిలీ మందులు సరఫరా చేస్తున్నారని ప్రజల ఆరోగ్య దృష్టిలో ఉంచుకొని ఆన్లైన్ మందులు సరఫరా చేయడానికి చెక్ పెట్టాలని డిమాండ్ చేస్తూ మెడికల్ షాప్ ఆర్గనైజేషన్ తీసుకున్న ఈనిర్ణయంతో దేశవ్యాప్తంగా ఉన్న 12.40లక్షల పైగా ఉన్న మెడికల్ షాపులు మూత పడితే ఆస్పత్రిలో అత్యవసర మందులు దొరకక పేషెంట్లు ఇబ్బంది పడే అవకాశం ఉంటున్నారు. అంతేకాకుండా ఇతర వ్యాధులతో ఇబ్బంది పడే వాళ్లు సైతం తమ మందులు పుర్వమేలా ఉంటే ముందుగానే కొనుగోలు చేసి పెట్టుకోవాలని సూచించారు. సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లా కన్వీనర్ రవీందర్ శెట్టి, బ్రహ్మేశ్వర్, సుదర్శన్ మెడికల్ వంశీ, బాలాజీ మెడికల్ భాస్కర్, లక్ష్మీ తిరుపతయ్య, న్యూశ్రీమెడికల్ రాజు, విష్ణు, వెంకటేష్, రాజు, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# సెన్సస్ ప్రక్రియను పరిశీలించిన ఎంఇఓ

**కొల్లాపూర్,మే19, ప్రభాతవార్త:** కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెంట్లవెల్లి మండలంలో జనగణన చేస్తున్న పలు ప్రాంతాల ఇండ్లను మంగళవారం ఎంఇఓ పి ఇమాన్యుయెల్ ఆకస్మికంగా విజిట్ చేశారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ సూపర్‌వైజర్ నారాయణ సమక్షంలో ఎన్యూమరేటర్ల ను పరిశీలించామైనది. వారికున్న అనుమానాలను నివృత్తి చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పెంట్లవెల్లి మండలంలోని ఇండ్ల గణనా 100 శాతం త్వరగా పూర్తి చేయాలని తెలియజేశారు. సూపర్‌వైజర్లను అందరు కూడా మీకు కేటాయించిన ఎన్యూమరేటర్ల ను ఫీల్డ్ లెవెల్ కు వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. పెంట్లవెల్లి లోని ఎస్ఆర్ (బాలుర), న్యూ బస్టాండ్ ఏరియా, తోట వీధిఏరియా, బేకరి వెనుక సైడు, వడ్డెర వీధి మొదలగు ఏరియాలో సూపర్‌వైజర్లతో తనిఖీలు నిర్వహించారు.


# హోంగార్డ్ బాలకృష్ణ మృతికి జిల్లా పోలీస్ శాఖ నివాళి



హోంగార్డు మృతి చెందడంతో నివాళులర్పించి ఆర్థిక సహాయం అందజేస్తున్న పోలీసులు

**దామరగిద్ద, మే19 ప్రభాతవార్త:** దామరగిద్ద పోలీస్ స్టేషన్‌లో హోంగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ సెలవులపై స్వగ్రామమైన కొత్తపల్లి మండలం గోకుల్ నగర్‌కు వెళ్లగా తీవ్ర వమనలతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో గుండె పోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ డా. వినీత్ ఆదేశాల మేరకు ఆర్ఐ విజయ్ భాస్కర్, హోంగార్డ్ ఇంచార్జి ఆర్ఎస్ఐ శివశంకర్‌లు బాలకృష్ణ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే పోలీస్‌శాఖ తరఫున తక్షణ సహాయంగా రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. వినీత్ మాట్లాడుతూ, హోంగార్డ్ బాలకృష్ణ మృతి పోలీస్ శాఖకు తీరని లోటని పేర్కొన్నారు. బాలకృష్ణ కుటుంబ సభ్యులకు జిల్లా పోలీస్‌శాఖ అండగా ఉంటుందని, వారికి తగిన సహాయం, న్యాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# బిజినేపల్లి ఎస్ఐగా షంశోద్దీన్ బాధ్యతలు స్వీకరణ




నూతన ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన ఆయా గ్రామాల నాయకులు

**బిజినేపల్లి, మే19 ప్రభాతవార్త:** బిజినేపల్లి ఎస్సైగా షంశోద్దీన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఎస్ఐగా విధులు నిర్వహించిన కే.శ్రీనివాస్ మహబూబ్ నగర్ జిల్లాకు బదిలీ కాగా నాగర్ కర్నూల్ జిల్లా వీఆర్ నుంచి బిజినేపల్లి ఎస్ఐగా షంశోద్దీన్ విధుల్లో చేరారు. ఈసందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు కమతం శ్రీనివాస్ రెడ్డి, ప్రేమ్ లాల్ నాయక్, హరీశ్వర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, అబ్బ కర్నాకర్ తదితరులు ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు లా అండ్ ఆర్డర్కు వ్యతిరేకంగా అసాంఘీక కార్యకలాపాలకు, అవినీతి, అక్రమాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రతి రైతు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలి

- రైతుల డిజిటల్ నమోదు వేగవంతం చేయాలి
- రైతులకు ప్రభుత్వ పథకాలు చేరేందుకు యూఎఫ్ఐడీ కీలకం
- పసుపులలో రైతుల విశిష్ట సంఖ్య ప్రత్యేక గుర్తింపు నమోదు ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్




డేటా ఎంట్రీ అంశాలను పరిశీలిస్తున్న కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే19 ప్రభాతవార్త:** రైతులందరికీ ప్రభుత్వ పథకాలు సులభంగా చేరాలంటే విశిష్ట రైతు గుర్తింపు సంఖ్య కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. ప్రతి రైతు డేటా సక్రమంగా నమోదు కావడం ద్వారా భవిష్యత్‌లో సబ్సిడీలు, పంట భీమా, పంట కొనుగోలు విధానాలు మరింత పారదర్శకంగా అమలు చేయవచ్చని పేర్కొన్నారు. మంగళవారం కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పసుపుల గ్రామంలో రైతుల విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన రైతు డిజిటల్ యాప్ ద్వారా కొనసాగుతున్న యూనిక్ ఫార్మర్ ఐడెంటిఫికేషన్ నంబర్ నమోదు కార్యక్రమాన్ని సమగ్రంగా పరిశీలించిన కలెక్టర్, పనితీరు, పురోగతి మరియు రైతులకు అందుతున్న సేవలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న నమోదు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, సెల్‌ఫోన్‌లో నిర్వహిస్తున్న డేటాఎంట్రీ విధానాన్ని నిశితంగా గమనించారు. రైతుల వ్యక్తిగత వివరాలు, భూమి సంబంధిత రికార్డులు, ఆధార్ అనుసంధానం వంటి అంశాలు యాప్‌లో ఎలా నమోదు అవుతున్నాయో పరిశీలించారు. నమోదు ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. పసుపుల గ్రామానికి చెందినరైతు వై.యాదగిరి రావు వివరాలు నమోదు చేస్తున్న విధానాన్ని కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించారు. రైతు వై.యాదగిరిరావు వివరాలను కలెక్టర్ స్వయంగా నమోదు చేశారు. రైతు వివరాలు తప్పులు లేకుండా నమోదు చేయడం, భూసంబంధిత పత్రాలు సరిచూసుకోవడం, డిజిటల్ వ్యవస్థలో డేటా సమన్వయం వంటి అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నమోదు ప్రక్రియలో సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామస్థాయిలో అవగాహన పెంచేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని సూచించారు. రైతుల డిజిటల్ నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, అన్ని వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో మొత్తం 3,21,045 మంది రైతులు ఉండగా, ఇప్పటివరకు 2,18,890 మంది రైతుల వివరాలునమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇంకా 1,20,155 మంది రైతుల నమోదు పూర్తి చేయాల్సి ఉండగా, జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం68.9 శాతం నమోదు పూర్తయిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, మండల తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్లు సన్న రకంతో పాటు దొడ్డు రకం ధాన్యాన్ని కూడా దించుకోవాలి

- ప్రభుత్వానికి సహకరించకుంటే చర్యలు తప్పవు
- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి




రైస్ మిల్లర్‌తో సమావేశమైన జిల్లా కలెక్టర్

**వనపర్తి, మే 19, ప్రభాతవార్త:** జిల్లాలోని రైస్ మిల్లర్లు సన్న రకం వరి ధాన్యంతో పాటు దొడ్డు రకం వరి ధాన్యాన్ని కూడా దించుకొని ప్రభుత్వానికి సహకరించాలని, లేదంటే చర్యలు తప్పవని జిల్లాకలెక్టర్ ఆదర్శ్‌సురభి హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రబీ సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం దించుకునే అంశంపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైస్ మిల్లర్లకు పలు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రబీ సీజన్ కు సంబంధించి 55 మిల్లులు వరి ధాన్యం కేటాయింపులకు అర్హత సాధించాయని తెలిపారు. అయితే వాటిలో కేవలం 9 మిల్లులు మినహాయించి మిగతా మిల్లర్లు దొడ్డురకం వరి ధాన్యాన్ని దింపుకోవడంలో నిరాకరిస్తున్నట్లు తెలుస్తోందని అన్నారు. రైస్ మిల్లర్లు ఈ సీజన్లో సన్న రకం వరి ధాన్యంతో పాటు, దొడ్డు రకం వరి ధాన్యాన్ని అని కూడా దింపుకోవడంలో ప్రభుత్వానికి సహకరించాలని ఆదేశించారు. దొడ్డు రకం వరి ధాన్యాన్ని దింపుకోవడంలో రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించకుండా ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవనికలెక్టర్ హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశానుసారం మిల్లర్లు సహకరించకుండా ఉంటే అటువంటి వారిని బ్లాక్ లిస్టులో పెట్టడం జరుగుతుందని హెచ్చరించారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని వాటిని పరిష్కరించడానికి ప్రభుత్వం తరఫున సహకరిస్తామని విజ్ఞప్తి చేశారు. అర్హత సాధించిన మిల్లర్లు ప్రతి ఒక్కరు రెండు రకాల వరి ధాన్యాన్ని దింపుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. అదేవిధంగా రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఖాళీగా ఉన్న గోదాములను ధాన్యాన్ని నిల్వ చేసేందుకు అందుబాటులోకి తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గోదాములను వెంటనే అందుబాటులోకి తీసుకొని ధాన్యం కోసం ఓపెన్ చేసి ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారి కాశీవిశ్వనాథ్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఆంజనేయులు, గిడ్డంగుల కార్పొరేషన్ రీజనల్ మేనేజర్, రైస్ మిల్లర్లు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమసమాజ నిర్మాణమే సుందరయ్య ఆలోచన విధానం

■ సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పిట్టల రవి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ సభ్యులు పిట్టల రవి

**వీపనగండ్ల మే19, ప్రభాతవార్త:** సమసమాజ నిర్మాణమే కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆలోచన విధానం అని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పిట్టల రవి అన్నారు సిపిఎం పార్టీ నిర్మాణంలో ఒకరైన పుచ్చల పల్లి సుందరయ్య 41వ వర్ధంతి. సిపిఎం ఉమ్మడి వీపనగండ్ల మండలం కమిటీ ఆధ్వర్యంలో గోపాల్ దీన్నే గ్రామంలో మంగళవారం నాడు పార్టీ సభ్యుల మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులను ,పేదలను దోపిడీకి గురిచేస్తున్న పెట్టుబడి దారి వ్యవస్థను కూల్చి సోషలిజం స్థాపించ డమే సుందరయ్య ఘనమైన నివాళి అని అన్నారు. భారత దేశంలో సంపద కొంతమంది దగ్గర పోగుబడుతున్నది 90 శాతం మంది పేదలుగా నిరుపేదలుగా జీవనం కొనసాగిస్తున్నారు. కులం ,మతం పేరుతో సమాజాన్ని నిలువున చీల్చింది పెట్టుబడి దారి వ్యవస్థ అని అన్నారు పెట్రోల్ ,డీజిల్ ,ఆదాచేయండి, బంగారం కొనుగోలు చేయకండి అంటూ స్వయానా ప్రధాని ప్రచారం చేయడం వెనుక దాగివున్న ఉన్న అసలు రహస్యం సంక్షోభమే అన్నారు .పెట్టుబడి దారి వ్యవస్థ ఆర్థిక అసమానతలు, సామాజిక, రాజకీయ అసమానతలు పెంచి పోషించే దుర్మార్గపు వ్యవస్థ అన్నారు. ఈ వ్యవస్థ మార్పుకోసం నేటి యువత ,కార్మిక వర్గం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలనీ ఆయన పిలుపునిచ్చారు. మధ్యాహ్నం గోపాల్ దిన్నె గ్రామంలో పార్టీ జెండాను పార్టీ సీనియర్ నాయకులు శేఖర్ రెడ్డి ఎగంవేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గోపల్ దీన్నే సర్పంచ్ దొడ్ల కవిత సిపిఎం మండల కార్యదర్శి డి బాల్‌రెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎం కృష్ణయ్య, మహబూబ్ బాషా, రవి ప్రసాద్, మండల నాయకులు ఆది, వెంకటేష్, మండల నాయకులు వి కృష్ణయ్య, బాలగౌడ్, వెంకటస్వామి, నిరంజన్, శేఖర్ రెడ్డి, ఖాజా హుస్సేన్, రేవతమ్మ, ముత్యాలు, జిల్లా కార్యదర్శి శివ, వార్డు మెంబర్స్ చంద్రయ్య, పద్మ, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

# మద్దూరులో క్రీడా ప్రాంగణ నిర్మాణానికి భూమి అప్పగింత

*యువత ఎన్నో రోజుల కల సాకారం దిశగా ముందడుగు*



జిల్లా క్రీడా శాఖ అధికారికి స్థలానికి సంబంధించిన పత్రాలు అందజేస్తున్న దృశ్యం

**మద్దూరు, మే 19 ప్రభాతవార్త:** మద్దూరు మండల కేంద్ర యువత ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న క్రీడా ప్రాంగణ నిర్మాణానికి కీలక ముందడుగు పడింది. నారాయణపేట జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక ఆదేశాల మేరకు మద్దూరు పట్టణ శివారులోని సర్వే నంబర్ 71లో ఉన్న 4 ఎకరాల 10 గుంటల ప్రభుత్వ భూమిని నూతన క్రీడా ప్రాంగణ నిర్మాణం కోసం జిల్లా క్రీడాశాఖకు అధికారికంగా అప్పగించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ మహేష్ గౌడ్, జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి వెంకటేష్ శెట్టికి భూమికి సంబంధించిన పత్రాలను అందజేశారు. మద్దూరు ప్రాంత యువతకు సరైన క్రీడా మైదానం లేకపోవడంతో చాలా కాలంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం క్రీడా ప్రాంగణం కోసం భూమిని కేటాయించడంతో యువతలో ఆనందం వ్యక్తమవుతోంది. క్రీడా ప్రాంగణం ఏర్పాటుతో గ్రామీణ ప్రాంత యువకులు క్రీడల్లో శిక్షణ పొందేందుకు, వివిధ పోటీల్లో ప్రతిభ చాటుకునేందుకు అవకాశం లభించనుంది. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులు తయారయ్యేందుకు ఈ మైదానం దోహదపడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో మండల పీఏసీఎస్ అధ్యక్షులు గుళ్ల నర్సింహులు, కాంగ్రెస్ నాయకులు జనార్దన్, ఖాజీపూర్ గ్రామ సర్పంచ్ సాయిలు, ఆర్ఐ అమరేందర్ శెట్టి, ఎస్‌హెచ్‌ఓ రాజు, మైనార్టీ నాయకులు ఇబ్రహీం, ఖాజీపూర్ చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమం, బాలసదనంలో ఆకస్మిక తనిఖీ

■ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి

■ సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్



చిన్నారులతో సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్

**నారాయణపేట, మే 19 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా కేంద్రంలోని బారం బావి సమీపంలో ఉన్న వృద్ధాశ్రమం, బాలసదనం హోమ్‌ను సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హోమ్‌లో నివసిస్తున్న వృద్ధులు, చిన్నారుల హాజరు వివరాలను పరిశీలించి హాజరు పట్టికలను తనిఖీ చేశారు. సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే వృద్ధుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. హోమ్‌లోని సిబ్బందితో మాట్లాడుతూ వృద్ధులు, చిన్నారులకు ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. రోజువారీ ఆహార పట్టిక, వసతులు, నిత్యావసర వస్తువులు, ఆహార ధాన్యాల నాణ్యత, తాగునీటి సదుపాయం, పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించారు. అలాగే రిజిస్టర్లు, సీసీటీవీ ఫుటేజ్‌లు, మూవ్‌మెంట్ రిజిస్టర్లు, అడ్మిషన్ విధానాలు, అధికారిక ఉత్తర్వుల అమలు, సరుకుల కొనుగోలు రికార్డులు, రైస్ క్వాంటిటీ రిజిస్టర్లు, డైలీ డైరీలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా తెలుసుకున్నారు. ప్రతి రోజూ తాజా కూరగాయలను కొనుగోలు చేయాలని, మందులు, సిరప్‌ల గడువుతేదీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. బెడ్‌షీట్లు, గదులు, బాత్రూములు, వాష్‌రూమ్‌లు పరిశుభ్రంగా ఉంచాలని, లైట్లు, ఫ్యాన్లు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా పరిశీలించాలని తెలిపారు. అలాగే కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు సంబంధించిన బిల్లులను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం చిన్నారులు, వృద్ధులకు అరటిపండ్లు పంపిణీ చేసి వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండి, వృద్ధులు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సిబ్బందిని సీనియర్ సివిల్ జడ్జి ఆదేశించారు.

# ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన కారు

## ఒకరు మృతి



మృతి చెందిన జయమ్మ (ఫైల్)

**వెల్దండ, మే 19 ప్రభాతవార్త:** శుభకార్యానికి హాజరై తిరిగి వెళ్తున్న క్రమంలో ఒక కుటుంబంలో విషాదం నింపింది. వంగూరు మండలం కోనేటిపురంలో బంధువుల ఇంట్లో నిర్వహించిన శుభకార్యానికి సర్వారెడ్డిపల్లి గ్రామనికి చెందిన జాజాల జనార్ధన్ సోమవారం హైదరాబాద్ నుండి కారులో తన భార్య జయమ్మ కూతురు దాలికతో కలిసి శుభకార్యా నికి హాజరై తిరిగి మధ్య రాత్రి హైదరాబాద్‌కు వెళుతుండగా మధ్య రాత్రి హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై గల జెపినగర్ నుండి కోట్ర చౌరస్తా మధ్యలో ఆగి ఉన్న కొండమల్లేపల్లికి చెందిన పొట్టు లారీని కారుఢీకొనడంతో జనార్ధన్ భార్య జయమ్మ, కూతురు దలిక గాయపడ్డారు. సంఘటన స్థలానికి ఎస్ఐ యుగంధర్ రెడ్డి చేరుకొని క్షత గాత్రులను మండలంలోని యెన్నం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జయమ్మ (34)మృతి చెందారు. మృతురాలి భర్త జనార్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# మానసిక రోగి అరెస్ట్.. ఆసుపత్రికి తరలింపు

**ఖిల్లాగణపురం మే19, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మానాజీపేట గ్రామానికి చెందిన పాలకొండ శేషయ్య (45) సంవత్సరములు అనే వ్యక్తి మానసిక అస్వస్థతతో బాధపడుతూ గ్రామంలోని చిన్న పిల్లలపై రాళ్లు విసరడం రాత్రి సమయంలో ఇండ్ల తలుపులు కొట్టడం ద్వారా గ్రామ ప్రజల్లో భయంగాలలో సృష్టిస్తున్నాడని అతని సోదరుడు పాలకొండ వెంకటేష్ తండ్రి వెంకటయ్య మంగళవారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేసుకుని సంబంధిత వ్యక్తిని వైద్య పరీక్షల నిమిత్తం మానసిక రోగుల ఆసుపత్రికి తరలించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

# అన్నదానానికి లక్ష విరాళం

**మల్దకల్ మే19, ప్రభాతవార్త:** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించడానికి గాను ఏర్పాటు చేసిన అన్నదాన ట్రస్ట్ కు హైదరాబాద్కు చెందిన నిర్మలాదేవి సురేందర్ దంపతులు వారి వివాహ వార్షికోత్సవంసందర్భంగా శ్రీస్వామివారికి రూ.1లక్ష ఆన్లైన్ ద్వారా జమ చేశారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి దేవాలయం అర్చకులు ఆశీర్వదించి స్వామివారి శేష వస్త్రాన్ని పట్వారి అరవిందరావు అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయ విశిష్టతను గురించి వివరించారు.

# కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

**వెల్దండ, మే 19 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని చెర్కూరు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్త బుర్ర లక్ష్మయ్య కుటుంబాన్ని మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెర్క రాజశేఖర్ ఆధ్వర్యంలో కుటుంబాన్ని పరామర్శించి రూ.20,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కాటిక జగ్గయ్య, కార్యదర్శి భిక్షపతి, కేశమోని కృష్ణయ్య, నారయ్య, బాలయ్య, భీమరాజు, లవకుశ, భీమయ్య, రమేష్, సత్యనారి, అశోక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

# ఎస్ఆర్ఎం మేళా ద్వారా తెలివితేటలను వెలికి తీయడం

**వెల్దండ, మే 19 ప్రభాతవార్త:** పత్రం ఫౌండేషన్ సంస్థ ద్వారా నిర్వహించిన స్కూల్ రిగనైజ్ మేళా విద్యార్థి యొక్క తెలివితేటలను వెలికితీయడం జరుగుతుందని పత్రం ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ సృజన అన్నారు. వెల్దండ మండలంలోని ఉబ్బల గట్టు తాండ అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి సూపర్వైజర్ అరుణ అధ్యక్షతన మేళా నిర్వహించిచిన్నారులు, వివిధ కలర్స్ గుర్తించడం, అక్షరాల గుర్తింపు డ్రైహింగ్ ఆక్టివిటీస్ నేర్పించారు. అనంతరం విద్యార్థులకు బుక్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంరాఘవేందర్, ఉపాధ్యాయులురమాదేవి, అంగన్వాడి టీచర్ శారదా, సుజాత, చిన్నారుల తల్లిదండ్రులు ఉన్నారు.

# డాక్టర్ విజయ్ మృతి సమాజానికి తీరని లోటు

**కల్వకుర్తి, మే 19 ప్రభాతవార్త:** ప్రజల డాక్టర్‌గా ఆయన చేసిన సేవలు ఎనలేనివని ప్రభుత్వ ఆసుపత్రి ఎండి గైనకాలజిస్ట్ డాక్టర్ విజయ్ మృతి సమాజానికి తీరని లోటని వందేమాతరం షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌నాయకులు పేర్కొన్నారు. మంగళవారం వీఎంఎఫ్ షటిల్ కోర్టులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు శశాంక్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్నది కాలంలోనే డాక్టర్ విజయ్ ప్రజా వైద్యునిగా గొప్ప పేరు పొందారని వారుఅన్నారు. రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందడం కల్వకుర్తి ప్రజానీకానికి తీరనిలోటని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ విజయ్‌తో ఉన్న వారి జ్ఞాపకాలను నేమరు వేసుకున్నారు. మంచి ప్రజా వైద్యుడు, మంచి క్రీడాకారుడిని ఈ సమాజం కోల్పోయిందని బాధపడ్డారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వారు ఆకర్షించారు. కార్యక్రమంలో కిషోర్ రెడ్డి, జూలూరి ప్రకాష్, అంజి, బాబురావు, మురళి, శీను, విజయ్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ శివ, తదితరులు పాల్గొన్నారు.

# 50 శాతం సబ్సిడీపై పచ్చి రొట్ట ఎరువుల విత్తనాల పంపిణీ

**మద్దూర్, మే 19 ప్రభాతవార్త:** మద్దూర్ మండలంలోని పల్లెర్ల గ్రామంలో రైతు వేదికలో పచ్చి రొట్ట ఎరువుల విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రైతులకు 50 శాతం సబ్సిడీపై విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ, పచ్చి రొట్ట ఎరువుల సాగు వల్ల నేల సారవంతత పెరిగిసేంద్రియ కార్బన్ శాతం మెరుగుపడుతుందని తెలిపారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. పచ్చి ఎరువుల విత్తనాలు మద్దూర్ అగ్రోస్ రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని, రైతు వాటాగా క్వింటాల్‌కు రూ.8,175 చెల్లించి పొందవచ్చని తెలిపారు. జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు ప్రతులను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జి. నర్సింలు, మండల వ్యవసాయ అధికారి ఎ.ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ వెంకట్ రెడ్డి, సంజీవ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల కోసం స్థలాల పరిశీలన

**మక్తల్ టౌన్, మే 19 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మంత్రి డా. వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మక్తల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాల కోసం తహసిల్దార్ ఆధ్వర్యంలో పట్టణ శివారులో పలు స్థలాలను పరిశీలించారు. ఇప్పటికీ పలు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండటంతో శాశ్వత భవనాలు నిర్మించాలనే ఉద్దేశంతో స్థలాల సర్వే చేపట్టినట్లు తెలిపారు. పరిశీలనలో మక్తల్ తహసిల్దార్ సతీష్, సర్వేయర్ రాజన్న, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ అల్లూరి రవి కుమార్, మార్కెట్ డైరెక్టర్ శాలం, ఆశప్ప ఉన్నారు.

